

ఉమ్మడి జిల్లాలో చలి పంజా

వికారాబాద్ : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పంజా విసురుతోంది. చలి తీవ్రత ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్ల నుంచి అడుగు బయట పెట్టాలంటేనే గజగజలాడుతున్నారు. చల్లని గాలులకు చిన్న పిల్లలు, వృద్ధులు అవస్థ పడుతున్నారు. చలిని రక్షణ పొందడానికి స్వెటర్లు కొనుగోలు చేస్తున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 10.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నిరంతరం కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్. శంకర్ అన్నారు. గురువారం జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులలో సిలబస్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఉదయం స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. చురుకైన విద్యార్థులను గుర్తించి ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభించినందున త్వరగా సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. తరుచుగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ నర్సింహారెడ్డి, రూపాలక్ష్మి, విజయ కుమార్, బుచ్చిరెడ్డి, సురేశ్వర స్వామి, కుమార స్వామి, స్వర్ణలత, వెంకటేశ్వర రావు, మాక్బుల్ తదితరులు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కులకచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యా నాయక్ డిమాండ్ చేశారు. ఎంఈవో కార్యాలయం ఎదుట గురువారం ఉద్యోగులతో కలిసి భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, యంఐఎస్ కో ఆర్డినేటర్ సంతోష్ రెడ్డి, మెసేంజర్ రాములు, సీఆర్‌పీలు కృష్ణయ్య, మహిపాల్, విజయ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి సుధాకర్

గేదెలకు పౌష్టికాహారం అందించాలి


ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాడిగేదెలకు పౌష్టికాహారం అందించి పాలదిగుబడి పెంచాలని జిల్లా పశువైద్యాధికారి సుధాకర్ సూచించారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్ పశువైద్యశాలలో గురువారం ఎస్సీలకు దాణా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించి రైతులు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింహ, రామకృష్ణ, శ్రీనాథ్, పద్మిని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


తాండూర్: దేవనూర్‌లో ధాన్యం లోడింగ్ చేస్తున్న బిహారీ హమాలీలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

హమాలీ.. బిహారీ!

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వారే అధికం



ఉమ్మడి జిల్లాలో..	
కొనుగోలు కేంద్రాలు	150
మొత్తం హమాలీలు	1,546
స్థానికులు	626
బిహారీలు	920



- కాంటాలు వేసేందుకు ముందుకు రాని స్థానికులు
- వచ్చినా అధిక కూలి డిమాండ్
- ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్న బిహారీలు
- వారికి కూలి కూడా తక్కువే
- వారివైపే కేంద్రాల నిర్వాహకుల మొగ్గు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇబ్బడిముబ్బడిగా ధాన్యం వస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకు కాంటాలు వేసినా ఇంకా రాశులు పెద్ద మొత్తంలోనే ఉంటున్నాయి. ఈ తరుణంలో కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసేందుకు బిహార్ కూలీలు కీలకమయ్యారు. స్థానికులు కాంటాలు వేసేందుకు ముందుకు రాకపోవడం.. కొన్నిచోట్ల వచ్చినా అధిక కూలీ డిమాండ్ చేస్తుండడంతో కేంద్రాల నిర్వాహకులు బిహారీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కువమంది వారే పనిచేస్తున్నారు. స్థానిక హమాలీల కంటే బిహారీలు ఎక్కువ సమయం పని చేస్తుండడంతో వారి వైపే నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ బిహారీ హమాలీలతో నిండిపోయాయి.

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, నవంబరు 28: ఉమ్మడి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా మారి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. స్థానిక హమాలీల కంటే ధర తక్కువగా తీసుకోవడంతో పాటు పనులను వేగంగా చేస్తుండడంతో కేంద్రాల నిర్వాహకులు వారివైపే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ వడ్లను బస్తాల్లో నింపి, తూకం వేసి లోడ్ చేసినందుకు స్థానిక హమాలీలు సుమారు రూ.60 తీసుకుంటున్నారు. దీనికి తోడు స్థానిక హమాలీలకు వ్యవసాయం కూడా ఉండడంతో కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో రైతులు తమ ధాన్యం కాంటాలు వేయడంలో ఆలస్యం అవుతుందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై

మిగతా 7వ పేజీలో...

దళితులను విభజించే కుట్ర

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్


పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఘట్‌కేసర్/కీసర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మనువాదులు ఏకమై దళితులను విభజించేందుకు కుట్ర చేస్తున్నారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, దళితుల ఐక్యత కోసం చేపట్టిన మాలల మహా పాదయాత్ర గురువారం ఘట్‌కేసర్ చేరింది. అంబేడ్కర్ చౌరస్తా వద్ద పాదయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా చేపడుతున్న ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. అక్టోబరు 25న ప్రారంభమైన మొదటి విడత పాదయాత్ర భద్రాచలం నుంచి ప్రారంభమై 16 జిల్లాల్లో 35 నియోజకవర్గాల్లో వెయ్యి కిలోమీటర్ల మేర 38 రోజులు సాగుతుందని తెలిపారు. డిసెంబరు 1న పాదయాత్ర హైదరాబాద్ చేరి అక్కడ ముగింపు సభను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం పాదయాత్ర మేడిపల్లి చేరింది. మాలల మహా పాదయాత్ర కీసరకు చేరుకున్న సందర్భంగా చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పిల్లి సుధాకర్ పూలమాల వేశారు. దేశంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని సుధాకర్ వ్యతిరేకించారు. కార్యక్రమాల్లో బి.రమేష్, చిప్పల నర్సింగరావు, రవికాంత్, పరశురాం, అంజనేయులు, రఘు, మల్లేష్, మురళీమోహన్, దాసు, పద్మారావు, అక్కపల్లి అర్జున్, బత్తుల వేణుగోపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్ట్

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం నగరం నుంచి లగచర్లకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులో బయలుదేరిన బస్సును పరిగిలో అడ్డుకున్నారు. బస్సులో ఉన్న మహేశ్‌తోపాటు, నాయకులు శ్రీనివాస్, అసిఫ్, రాజేందర్, రహిమ్, అక్షిత్, శ్రీకాంత్, లోకేష్‌ను అరెస్ట్ చేసి పరిగి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులకు అండగా పోరాటం చేస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


గొట్టిగఖుర్దులో వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బషీరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం గొట్టిగఖుర్దు పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వంట గదులను పరిశీలించారు. వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడి బియ్యం ఎలాగున్నాయని అడిగారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి అన్నం ఎలా ఉంటోంది.. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? అని తెలుసుకున్నారు. భోజన నాణ్యతలో నిర్లక్ష్యం చేయొద్దని ఉపాధ్యాయులకు, వంట వారికి సూచించారు. అంతకు ముందు కాశీంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులు మంగమ్మ, నర్సమ్మలతో మాట్లాడి సూచనలు చేశారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి మోహన్ బాబు, తహసీల్దార్ వై.వెంకటేష్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

తాండూరు రూరల్: చెంగోల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లింగ్యానాయక్ పరిశీలించారు. ఎన్ని క్వింటాళ్ల వడ్లు కొన్నారని కేంద్రం నిర్వాహకులను అడిగారు. 4,500 బస్తాలు కాంట వేశామని, మరిన్ని వడ్లు రానున్నాయని చెప్పారు. రైతులకు ఇబ్బందులు కల్గించకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ తారాసింగ్, రైతులు ఉన్నారు.

అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు

నాపరాతి గనుల్లో లీజు తప్పనిసరి

తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ


నాపరాతి గనిని పరిశీలిస్తున్న మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్కాపూర్, ఓగీపూర్, కోటబాస్పల్లి, సిరిగిరిపేట్, సంగెంకలాన్ తదితర గ్రామాల్లోని నాపరాతి గనుల్లో లీజు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మైన్స్ ఏడీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం మల్కాపూర్ శివారులోని సర్వే నంబర్- 75లో కొత్తూరు శాంతు అనే వ్యక్తి నాపరాతి గనుల్లో విద్యుత్ శాఖ నుంచి అనుమతులు లేకుండానే కనెక్షన్ తీసుకుని అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని సమాచారం అందింది. ఈ మేరకు ఇటీవల కలెక్టర్, రాష్ట్ర మైన్స్ శాఖ డైరెక్టర్ , తాండూరు సబ్ కలెక్టర్, తాండూరు తహసీల్దార్, విద్యుత్ శాఖ ఏడీ, లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తాండూరు మైన్స్ శాఖ ఏడీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులతో ఏయే గనులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు? లీజులు ఉన్నవాటికే ఇచ్చారా? లేదా? అనే విషయాలను తెలుసుకున్నారు. సర్వే నంబర్-75లో ఎంతమేరకు అక్రమ తవ్వకాలు జరిపారు? తదితర విషయాలపై సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ తవ్వకాలు జరిపితే వారిపై చట్టరీత్యా చర్యలతోపాటు భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మైన్స్ శాఖ ఆర్ఐ నిర్మల, మైన్స్ శాఖ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం!

ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు

- డిగ్రీ కళాశాల ఏర్పాటుకు దశాబ్దకాలంగా పోరాటం
- కళా విహీనంగా శామీర్‌పేట బస్టాండ్
- హామీలకే పరిమితమైన డంప్‌యార్డు తొలగింపు
- 'మేడ్చల్'లో ఎక్కడి సమస్యలు అక్కడే
- ఇక్కడి నుంచి హేమాహేమీలు గెలిచినా మారని పరిస్థితి

ఆంధ్రజ్యోతి, మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 28: మేడ్చల్ నియోజకవర్గానికి రాజకీయాల్లో ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి నుంచి హేమాహేమీలు గెలుపొంది, ఉన్నత పదవులు అధిరోహించినా ఇక్కడ పెండింగ్ సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. రాష్ట్రం మారినా.. పాలకులు మారుతున్నా ఇక్కడి ప్రజల తలరాలతలు మాత్రం మారడం లేదు.

డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు ఆగని పోరాటాలు

మేడ్చల్ నియోజకవర్గంలో ఇప్పటికీ ఒక్క ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా లేదు. కాలేజీ ఏర్పాటుకు

మిగతా 8వ పేజీలో...


కళావిహీనంగా దర్శనమిస్తున్న శామీర్‌పేట బస్టాండ్

రైల్వే అండర్ పాస్ నిర్మించాలి

గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వద్ద స్థానికుల తిప్పలు

బీజేపీ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి

7



విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై శ్రద్ధ చూపాలి

పోటీ ప్రపంచంలో అమ్మాయిలు ముందు వరుసలో ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి డీబీ శీతల్

7



రిజర్వేషన్లపై చర్చ

తాజాగా 'మండల పరిషత్' ఏర్పాటు

జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలకు సన్నాహాలు

మూడేళ్ల కిందటే చౌడాపూర్ మండలం ఏర్పాటు

8



అనుకూల స్థలంలోనే ఆసుపత్రి ఏర్పాటు

కొత్తూర్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి ప్రజలకు అనుకూల స్థలంలోనే ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ కొత్తూర్‌కు దూరంగా, ప్రజలకు అనుకూలంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యపై కౌన్సిలర్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే పట్టణానికి సమీపంలో ఉన్న భవనాన్ని గుర్తించి ఆస్పత్రిని అందులోకి షిఫ్ట్ చేయాలని వైద్య శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. దీంతో డీఎంహెచ్‌వో గురువారం ఎమ్మార్సీ భవనం, పశువుల ఆస్పత్రి, పాత మున్సిపల్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, నిర్మాణంలో ఉన్న కూరగాయాల మార్కెట్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ.. తాను పరిశీలించిన భవనాల నివేదికను ఎమ్మెల్యే శంకర్‌కు, ఉన్నతాధికారులకు పంపి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్ హేమదేవేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



భవనాలు పరిశీలించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

ప్రశ్నిస్తేనే అవినీతి అంతం



సర్వేను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు ప్రశ్నిస్తేనే అవినీతి అంతం అవుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఆధ్వర్యంలో గురువారం అవినీతి నిర్మూలనపై చేపట్టిన సర్వేను నర్సింహులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చాలా మంది ఉద్యోగులు ప్రజాధనాన్నే వేతనంగా తీసుకుంటున్న విషయాన్ని మరచి ప్రతీ పనికి లంచం ఆశిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దాడులు చేసినా, అవినీతి అధికారులను జైళ్లకు పంపినా అవినీతి ఆగడం లేదన్నారు. లంచావతారుల ఇండ్లలో కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు, కోట్లాది రూపాయల కరెన్సీ కట్టలు, కోట్లాది ఆస్తులు వెలుగు చూస్తున్నాయన్నారు. ప్రజలు చైతన్యమై లంచాలు అడిగే వారిని నిలదీస్తేనే అవినీతి తగ్గుతుందని నర్సింహులు అన్నారు. 'యూత్ ఫర్ యాంటీ కరప్షన్'ను స్థాపించి ముందుకు సాగుతున్న రాజేంద్ర, డాక్టర్ ప్రవంతి, కె.రమేష్‌బాబు, జి.హరికృష్ణలను ఆయన అభినందించారు.

తప్పుల్లేకుండా డాటా ఎంట్రీ చేయాలి



మండల పరిషత్‌లో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

చేవెళ్ల,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. గురువారం చేవెళ్ల, షాబాద్ మండలాల్లో కంప్యూటర్ డాటా ఎంట్రీ విధానాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సామాజిక విద్య, ఉద్యోగ, కుల గణన డాటాను తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. ప్రతీ కుటుంబం డాటా ఫామ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. తప్పులు ఎంట్రీ చేస్తే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలాఖరుకల్లా డాటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో విఠలేశ్వర్, షాబాద్ ఎంపీడీవో అపర్ణ, సూపరింటెండెంట్ రవీందర్ ఉన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



కేజీబీపీ వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు, టీచర్లు

కడ్తాల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య అన్నారు. కడ్తాల కేజీబీవీని గురువారం భోజన విరామ సమయంలో యూటీఎఫ్ నాయకులు సందర్శించారు. సమస్యలడిగితెలుసుకున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనాలివ్వాలని, ఎస్‌వోలకు ప్రిన్సిపాళ్లకు కల్పిస్తున్న వసతులివ్వాలని, ఉద్యోగులకు సెలవులివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబరు 9 నుంచి 13 వరకు సీఎంకు లేఖలు పంపడం, 22 నుంచి 25 వరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, జనవరి 7న కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరశన దీక్షలు, 28న హైదరాబాద్‌లో మహాధర్నా, ఫిబ్రవరిలో చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షురాలు కౌసల్య, నాయకులు మల్లయ్యగౌడ్, భీముడు, నర్సింహమూర్తి, భాగ్యలక్ష్మి, యూసూబా, టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం చేసిన ఏడుగురు ఆర్‌ఎంపీలపై కేసు

తాండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోగులకు ఆపరేషన్లు, అర్హతకు మించిన వైద్యం చేస్తున్నారని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుతో తాండూరులో ఏడుగురు రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ల(ఆర్‌ఎంపీల)పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ కుమార్ గురువారం చెప్పారు. ఆర్‌ఎంపీలు అర్హత లేకున్నా ఎంబీబీఎస్ డాక్టర్ల తరహాలో వైద్యం చేస్తూ డాక్టర్లుగా చెలామణీ అవుతూ రోగుల ప్రాణాల మీదికి తెస్తున్నారు. తాండూరులో ఇటీవల ఓ ఆర్‌ఎంపీ కాలు నొప్పితో వచ్చిన ఓ వృద్ధురాలికి ఇంజక్షన్ ఇవ్వగా ఆమె కాలు చచ్చుబడిపోయింది. దీంతో అధికారులు దాడులు చేసి కొన్ని ఆర్‌ఎంపీ క్లినిక్‌లను సీజ్‌చేశారు. తాండూరులో పాషా ఫస్టెయిడ్ సెంటర్(ఇస్మాయిల్ పాషా), పీపుల్స్ ఫస్టెయిడ్ సెంటర్(మన్సూర్ షేక్), లక్ష్మణ్‌రావు ఫస్టెయిడ్(సునిత్ కుమార్), శ్రీబాలాజీ ఫస్టెయిడ్ సెంటర్(గణపతిరావు), విజయ్ క్లినిక్(సల్మాన్), యూసుఫ్ ఫస్టెయిడ్ సెంటర్(ఎండీ మౌలానా), రక్షిత పాలి క్లినిక్, రెడ్డి క్లినిక్‌లకు చెందిన సురేందర్‌రెడ్డిలపై కేసులు నమోదు చేశారు.

డిసెంబరులో సీఎం కప్ టోర్నీ

- నిర్వహణకు మండల కమిటీలు

తాండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):'చీఫ్ మినిస్టర్స్ కప్-2024' క్రికెట్ టోర్నీని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పోటీలను ఈ యేడాది కాస్త ఆలస్యంగా చేపడుతున్నారు. డిసెంబరు మొదటి వారంలో పోటీలు జరుగనున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తారు. గ్రామ స్థాయిలో డిసెంబరు 7, 8 తేదీల్లో, మండల/నియోజకవర్గ కేంద్రాల్లో డిసెంబరు 10, 11, 12 తేదీల్లో, అలాగే జిల్లాస్థాయిల్లో డిసెంబరు 16 నుంచి 21 వరకు నిర్వహిస్తారు. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే పోటీల్లో విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. పోటీలకు మండల స్థాయి కమిటీలను నియమిస్తారు. గతంలో ఎంపీపీలు కన్వీనర్లుగా వ్యవహరించేవారు. ప్రస్తుతం పాలకవర్గాలు లేనందున స్పెషలాఫీసర్లు కన్వీనర్లుగా కమిటీలేర్పాటుచేసే అవకాశం ఉంది. తాండూరు మున్సిపాలిటీ, పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు మండలాలు విద్యార్థులు, యువత పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌కు వచ్చే నెల 6న శంకుస్థాపన

- హాజరుకానున్న ఆరోగ్య శాఖ మంత్రి, అసెంబ్లీ స్పీకర్

తాండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.150కోట్లతో ఈ భవన నిర్మాణానికి డిసెంబరు 6న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు శంకుస్థాపన చేస్తారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా ఆహ్వానించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యాలాల మండలం దౌలాపూర్‌లో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ భారీఎత్తున నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

అక్రమ నిర్మాణం కూల్చివేత


అనుమతి లేని నిర్మాణాన్ని కూల్చుతున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని కృష్ణా పైప్‌లైన్ బైపాస్ రోడ్డు పక్కన భవానీ నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన ఓ చర్చి(ప్రార్థనా మందిరం)ని మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. సుచిరా బార్ అండ్ రెస్టారెంట్ పక్కన అక్రమంగా చర్చి నిర్మిస్తున్నారు. దీంతో కాలనీ వాసుల ఫిర్యాదుతో అధికారులు జేసీబీతో నిర్మాణాన్ని కూల్చివేశారు. అనుమతుల్లేకుండా, ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేసినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్ హెచ్చరించారు.

విద్యుత్ అధికారులు రైతులను ఇబ్బందిపెడితే ఊరుకోం


మాట్లాడుతున్న కిసాన్ సంఘ్ నాయకులు

షాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీలకు, వ్యాపార సంస్థలకు టీజీఐఐసీ కేటాయించిన దేవాదాయ భూముల నుంచి విద్యుత్ లైన్ల తొలగింపుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం ఎర్రోనిగూడలో ఆయన మాట్లాడుతూ.. సీతారాంపూర్‌లోని రామచంద్రస్వామి ఆలయ భూముల పక్కన పోతుగల్, లక్ష్మరావుగూడ, ఎర్రోనిగూడ, మల్‌రెడ్డిగూడ, గోపిగడ్డ, పోలారం గ్రామాల రైతుల పట్టాభూములు ఉన్నాయన్నారు. ఏళ్ల కింద ఆలయ భూముల్లో పాతిన విద్యుత్ స్తంభాలు, లైన్లను అధికారులు తొలగిస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూముల్లోని విద్యుత్ లైన్లు, డీటీఆర్‌లను తొలగిస్తే వెంటనే వాటిని పట్టా భూముల్లో సాగు చేస్తున్న రైతులకు అనుకూలంగా అమర్చి సేద్యానికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల నాయకులు అయూబ్, యాదవరెడ్డి, వీరేశం, సత్యంగౌడ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఐజీ


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ సత్యనారాయణ

వికారాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం మల్టీజోన్-2 డీఐజీ సత్యనారాయణ సందర్శించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్‌ఎక్స్‌లో డీలింగ్‌తో మోసం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓఎల్‌ఎక్స్ యాప్‌లో ఫోన్ కోసం డబ్బు చెల్లించి వ్యక్తి మోసపోయిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో వెలుగు చూసింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా దివం చెరువుకు చెందిన దాసరి సాయిగౌడ్(26) పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉంటున్నాడు. ఈ నెల 24న ఓఎల్‌ఎక్స్ యాప్‌లో ఫోన్ కోసం బ్రౌజ్ చేశాడు. ఓ ఫోన్ రూ.79,000కు ఉందని కిరణ్ అనే వ్యక్తి తెలిపాడు. దీంతో ఇద్దరూ మాట్లాడుకొని ఫోన్ రూ.79వేలకు క్రయవిక్రయాలకు ఒప్పందం చేసుకున్నారు. కిరణ్ క్యూఆర్ కోడ్ పంపి డబ్బు చెల్లించాలని చెప్పాడు. దీంతో సాయిగౌడ్ ఐదుసార్లు రూ.79వేలు ఓఎల్‌ఎక్స్ యాప్ ద్వారా పంపాడు. అయితే మూడు రోజులైనా తనకు ఫోన్ రాకపోవడంతో కిరణ్‌కు పలుమార్లు ఫోన్ ట్రై చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన సాయిగౌడ్ తనకు జరిగిన మోసంపై పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పత్తి రైతులకు తిప్పలు

- అప్పులు మిగిల్చిన కాటన్ సాగు
- వర్షాల్లేక మోడుగా మొక్కలు
- సగానికి పడిపోయిన దిగుబడి
- సీసీఐ కొనుగోలు కేంద్రం లేక దక్కని మద్దతు ధర
- ఇబ్రహీంపట్నంలో సీసీఐ సెంటర్ ఏర్పాటు చేయాలంటున్న రైతులు


పత్తి తీస్తున్న కూలీలు

యాచారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధర ఎక్కువగా ఉంటుందని పత్తి పంట వేస్తే దిగుబడి సరిగా రాక.. వచ్చినదానికీ మద్దతు ధర లభించక రైతులు అప్పులపాలయ్యారు. క్వింటాల్‌కు రూ.7,300 సీసీఐ మద్దతు ధర ఉన్నా స్థానికంగా సీసీఐ కొనుగోలు కేంద్రం/జిన్నింగ్ మిల్లులు లేక, దూరప్రాంతాలకు తరలించలేక రైతులు స్థానిక దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోతున్నారు. ఇబ్రహీంపట్నం, మాల్‌లలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. మద్దతు ధర పొందాలంటే ఆమనగల్లు, షాద్‌నగర్, నల్గొండ జిల్లా చింతపల్లిలోని సీసీఐ కేంద్రాలకు పత్తి తరలించాలి. అంత దూరం తీసుకెళ్లలేక, రవాణా ఖర్చులు సైతం భరించలేక గ్రామాలకు వచ్చే దళారులకు తక్కువ రేటుకు పత్తిని అమ్ముకుంటున్నారు. ఇదిలా ఉంటే పత్తి గూడ దిగే, కాత కాసే సమయాల్లో వానల్లేక దిగుబడి తగ్గింది. ఒక్కసారి పత్తి తీయగానే మొక్కలు మోడువారాయి. వర్షాలు బాగా కురిస్తే డిసెంబరు రెండో వారం దాకా పత్తి కాసేది. ఈ సారి వర్షాలు తక్కువ కురియడంతో మొదటి కాతతోనే సరిపెట్టినట్టయింది. ఈ నేపథ్యంలో పత్తి సాగుతో అప్పులే మిగిలాయని రైతులు వాపోతున్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో అయినా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధరన్నా దక్కేదని రైతులంటున్నారు. యాచారం మండలంలో వానకాలం 2,030 ఎకరాల్లో పత్తి సాగు చేశారని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.


ఒక్క సారికే మోడుగా మారిన పత్తి మొక్కలు

సాగు ఖర్చులు తడిసి మోపెడు!

ఎకరం దుక్కి దున్నేందుకు రూ.4వేలు, విత్తనానికి రూ.6వేలు(ఒక్కో ప్యాకెట్ రూ.2వేలు), విత్తేందుకు రూ.3వేలు, కలుపు తీతకు రూ.6,200, రసాయన మందులకు రూ.16వేలు, పత్తి తీతకు మరికొంత వెరసి ఎకరం పత్తి పంట సాగు చేసి అమ్ముకునే వరకు 35వేల నుంచి 40వేల ఖర్చు అవుతుందని మేడిపల్లికి చెందిన రైతు బీరప్ప చెప్పాడు. పట బాగా పడితే ఎకరంలో 15క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉంది. అయితే ఈ సారి ఏడెనిమిది క్వింటాళ్ల దిగుబడే వస్తోందని రైతులు చెబుతున్నారు. దీంతో పెట్టుబడి అయినా రాక అప్పులే మిగిలాయని అన్నదాతలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే వివిధ గ్రామాల నుంచి దళారులు పత్తి తక్కువ ధరకు సేకరించి షాద్‌నగర్, ఆమనగల్లు, చింతపల్లిలోని సీసీఐ కేంద్రాలకు, జన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరను వారే పొందుతున్నారు.

దుర్భరంగా కౌలు రైతుల పరిస్థితి

మండలంలోని కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. పత్తి సాగుకు ఎకరం భూమికి రూ.2,500 చొప్పున భూ యజమానులకు కౌలు రైతులు చెల్లిస్తున్నారు. పంట పండినా, పండకున్నా ఈ మొత్తం చెల్లించాల్సిందే. కొందరు పట్టాదారులైతే పంట వేసేకంటే ముందే డబ్బు తీసుకుంటున్నారు. చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, మాల్, మేడిపల్లి, నందివనపర్తి, తాటిపర్తి, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, తమ్మలోనిగూడ గ్రామాల్లో చాలా మంది కౌలు రైతులు పత్తి వేశారు. పట్టా రైతుకంటే కౌలు రైతులకు మరింతగా ఖర్చు పెరుగుతుందని రైతులు ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పత్తికంటే మక్కజొన్న, జొన్న, కూరగాయ పంటలు వేయడమే మేలనిపిస్తోందని రైతులు మైసయ్య, శ్రీశైలం, బీరప్ప, వెంకయ్య అభిప్రాయ పడ్డారు.

ఎకరానికి 8 క్వింటాళ్లే వచ్చింది



నేను నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. ఎకరానికి 8క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. పంటంతా అమ్మినా పెట్టుబడి రాక అప్పు తీరేలా లేదు. దళారులు క్వింటాల్‌కు రూ.6,500 ఇస్తున్నారు. పత్తికి కనీస ధర రూ.13వేలుంటేనే గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి.

\- ఐలయ్య, రైతు, కొత్తపల్లి

'పట్నం'లో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం ఇబ్రహీంపట్నంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తే స్థానికంగా దళారులకు అమ్మే పరిస్థితి ఉండదు. వరి, కూరగాయలు, ఇతర మెట్ట పంటల కంటే పత్తిసాగుకు ఖర్చెక్కువవుతుంది. కాబట్టి వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పత్తి విత్తనాలు, రసాయన మందులు అందిస్తే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

\- లాలూనాయక్, రైతు, కుర్మిద్ద తండా

రైల్వే అండర్ పాస్ నిర్మించాలి

రైల్వే ఉన్నతాధికారులను కోరిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి


అండర్ పాస్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న రైల్వే అధికారులు

మేడ్చల్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కట్టి ప్రజల కష్టాలు తీర్చాలని మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి రైల్వే ఉన్నతాధికారులను కోరారు. గురువారం రైల్వే సీనియర్ డీఈఎన్ ముత్యాలనాయుడు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఐవోబీ వి.విద్యాధర్‌లతో కలిసి గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్ వంతెన ఏర్పాటుకోసం స్థల పరిశీలన చేశారు. వంతెన లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులపై అధికారులకు వివరించారు. రైల్వే ట్రాక్ నుంచి అండర్ పాస్ లేక 44వ నంబర్ జాతీయ రహదారికి అర కిలోమీటర్ దూరం ఉన్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చేరాలంటే చుట్టూ 7కిలో మీటర్లు తిరిగి రావాల్సిన వస్తోందని తెలిపారు. కండ్లకోయం-గుండ్లపోచంపల్లిల మధ్య ఉన్న రైల్వే అండర్ పాస్ పనులు పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తే కేవీ రెడ్డి కాలనీ, లక్ష్మీనగర్, మానిక్ రెడ్డి కాలనీల మీదుగా రాకపోకలకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైల్వే అండర్ పాస్ లేక విద్యార్థులు, వృద్ధులు రైలు పట్టాలపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారని, వాహనదారులు చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నారని తెలిపారు. స్పందించిన అధికారులు తమ సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి రైల్వే అండర్ పాస్ నిర్మించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


ఎస్పీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లాల్‌కృష్ణ

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతనిస్తామని బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో గురువారం పరిగిలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, చిట్యాల్, సయ్యద్‌పల్లి, నస్కల్ పాఠశాలల్లోని 1,500 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ హస్టళ్లు, స్కూళ్ల విద్యార్థులకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రకాలుగా సేవలందిస్తామని, పుస్తకాలు, స్టేషనరీ తదితర వస్తువులు పంపిణీ చేస్తామని, పేద విద్యార్థులను ఆర్థికంగానూ ఆదుకుంటామని అన్నారు. పేద విద్యార్థులు పెద్ద చదువులు చదివి ఉన్నత శిఖరాలు చేరుకునేలా వెన్నుతట్టి ప్రోత్సాహకాలు అందిస్తామని వివరించారు. పరిగి ఎమ్మెల్యే సహకారంతోనూ సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. అస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో ఎంఏ.కరీం, ఏఎంసీ చైర్మన్ పరశరాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంతు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పి.చిన్న నర్సింహులు, నాయకులు ఆనెం ఆంజనేయులు, ఎన్.రామకృష్ణ, సర్వర్, పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై శ్రద్ధ పెట్టాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి శీతల్

వికారాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్, టెక్నాలజీలపై శ్రద్ధపెట్టి నేర్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయాధికారి డీబీ.శీతల్ అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగడి బాలికల రెసిడెన్షియల్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన శీతల్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో అమ్మాయిలు ముందు వరుసలో ఉండాలన్నారు. తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు మనందరం బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సాయిలత, జేవీవీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, విద్యార్థినులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లిలో ధాన్యాన్ని తూర్పార పడుతున్న బిహార్ కూలీలు


శామీర్‌పేటలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న బిహార్ కూలీలు

హమాలీ.. బిహారీ!

(5వ పేజీ తరువాయి)

వాదనకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో బిహార్ హమాలీలు తక్కువ సమయంలో ఎక్కువ ధాన్యాన్ని కాంటాలు వేస్తుండడంతో నిర్వాహకులు వారినే ఎక్కువగా పనిలో పెట్టుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో పత్తి పంట కూడా చేతికి రావడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకుంటున్నారు. వారితోనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. స్థానిక హమాలీలు గిట్టుబాటు కూలి దక్కడం లేదని చాలావరకు కేంద్రాలకు రావడం లేదు. మూడేళ్ల నుంచి బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలను ముందస్తుగా కొంత అడ్వాన్స్ ఇచ్చి తీసుకొస్తున్నారు.

పనుల వేగిరం..

బిహార్‌కు చెందిన కూలీలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీహార్ హమాలీలు పనిచేస్తుంటే, స్థానికులు మాత్రం 9గంటలకు వచ్చి సాయంత్రం 6గంటలకు వెళ్లిపోతున్నారు. కేంద్రాల్లో రైతు ధాన్యం పోసిన తర్వాత దాన్ని ఆరబెట్టడం, మిషన్ ద్వారా శుభ్రం చేయడం, కాంటా వేయడం, బస్తాలను లారీల్లోకి ఎత్తడం తదితర పనులన్నీ బిహార్ కూలీలతోనే జరుగుతున్నాయి. ముఖ్యంగా స్థానిక హమాలీల కంటే బిహార్ నుంచి వచ్చిన కూలీల ద్వారానే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, రైతులతో పాటు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రతి ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వివిధ రకాల పనుల నిర్వహణకు బిహార్ కూలీలు జిల్లాకు వస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకుని రేయింబవళ్లు పనిచేస్తున్నారు. కేంద్రాల్లో కొనుగోళ్ల పనులన్నీ పూర్తయిన తర్వాతే వీరంతా తమ స్వస్థలానికి వెళ్లిపోతారు. దాదాపు రెండు మాసాలకు పైగా కేంద్రాల్లో పనిచేస్తారు.


పరిగి మండలం సుల్తాన్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు లోడ్ చేస్తున్న బిహార్ కార్మికులు

కూలి తక్కువే

బిహారీ కూలీలు ధాన్యం క్వింటాల్‌కు రూ.40 కూలి తీసుకుంటున్నారు. స్థానిక హమాలీల కంటే రూ.20 తక్కువ గానే తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఉన్న హమాలీలు రోజుకు ఒక లారీ లోడ్ చేస్తే, బిహారీ హమాలీలు రోజుకు రెండు లారీలను నింపి మిల్లులకు పంపిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు తెచ్చిన ధాన్యం త్వరితగతిన కొనుగోలు కేంద్రాల నుంచి తరలిపోతుంది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి పడిగాపులు పడే పరిస్థితి తప్పింది.

ఐదేళ్ల నుంచి వస్తున్నాం



ఐదేళ్ల నుంచి శామీర్‌పేట వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి వస్తున్నాం. ఇక్కడ సీజన్ అయ్యేవరకు నెల రోజులు పని లభిస్తుంది. స్థానిక హమాలీలు, రైతులతో కలిసి పనిచేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేదు.

\- సర్వన్‌కుమార్, బిహార్ హమాలీ

గిట్టుబాటు అవుతోంది



క్వింటాల్‌కు రూ.40 చెల్లిస్తున్నారు. దీంతో ఇంతదూరం వచ్చినందుకు మాకు గిట్టుబాటు అవుతుంది. లోడింగ్, అన్‌లోడింగ్, బస్తాలు కుట్టడం, తూకం వేయడం లాంటి పనులు చేస్తున్నాం.

\- కైలాశ్‌కుమార్, బిహార్ హమాలీ

ఇక్కడెక్కువ కూలి



ఇక్కడ నెల, రెండు నెలలు పని ఉంటుంది. బిహార్‌లో కంటే ఇక్కడ కూలి ఎక్కువ లభిస్తోంది. హమాలీ చేసిన డబ్బులు ఒకేసారి చేతికి వస్తాయి. ఇక్కడి వారు మాకు ఫోన్ చేసి పిలిస్తే ఇక్కడకు వచ్చాం.

\- బ్రజేష్, హమాలీ, బిహార్

పనులు త్వరగా పూర్తి చేస్తారు



బిహార్ కూలీలు వేగంగా పనులు చేస్తారు. తూకం కూడా బాగా వేస్తారు. వీళ్లు ఎక్కువ సమయం పనిచేసి తూకం ఆలస్యం కాకుండా చూస్తారు. ఎక్కువ పని ఉన్నా కాదనకుండా చేస్తారు.

\- అనంతయ్య, రైతు, ధారూరు మండలం

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూర్ణాహుతిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో గురువారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు అట్టహాసంగా నిర్వహించారు. నూతన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం, హనుమాన్, సీతారామలక్ష్మణ, నవగ్రహ, గణపతి, నాగులు, శివ, నంది విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. చండీ ఉపాసకులు రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా యజ్ఞాలు, హోమాలతో ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, బీజేపీ నాయకులు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, డి.అశోక్‌గౌడ్, ఆలయ కమిటీ కన్వీనర్లు వెంకటేష్‌గుప్తా, వెంకటయ్య, యాదయ్య, బి.కృష్ణ, శ్రీను, నర్సింహ, కె.అంజయ్య, బాలు, రాజు, శ్రీశైలం, సురేందర్, యాదయ్య, మహేష్, కె.శ్రీనివాస్, లెవన్‌స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సన్మార్గానికి దైవ కార్యక్రమాలు దోహదం

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మనుషులు సన్మార్గంలో నడిచేందుకు, సమాజశాంతికి దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణపూర్‌లోని అభయాంజనేయస్వామి, కాశీ విశాలాక్షి ఆలయ వార్షికోత్సవానికి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయంలో పూజలు నిర్వహించారు.

రిజర్వేషన్లపై చర్చ

- జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలకు నేతల సన్నాహాలు
- మూడేళ్ల కిందట చౌడాపూర్ మండలం ఏర్పాటు
- తాజాగా మండల పరిషత్ కార్యాలయం మంజూరు

కులకచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండల జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లపై నాయకుల్లో చర్చ మొదలైంది. మూడు సంవత్సరాల కిందట గత ప్రభుత్వం కులకచర్ల మండల పరిధిలో చౌడాపూర్ మండలాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మండలానికి కాంగ్రెస్ ప్రభుత్వం మండల పరిషత్ కార్యాలయం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలాలను తగ్గిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో చౌడాపూర్ మండలం కొనసాగిస్తారా, తొలగిస్తారా? అనే అనుమానాలు మండల ప్రజల్లో ఏర్పడ్డాయి. తాజాగా ప్రభుత్వం మండల పరిషత్ కార్యాలయం మంజూరు చేస్తూ జీవో జారీ చేయడంలో జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు జరుగుతాయనే అభిప్రాయానికి ప్రజలు, పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు బేరీజు వేస్తున్నారు. ప్రస్తుతం నవాబుపేట మండలంలో కొనసాగుతున్న గ్రామాలు సైతం ఈ మండల పరిధిలోకి తీసుకువచ్చే ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.


చౌడాపూర్ మండల కేంద్రం

పాఠశాల చెంత పొంచి ఉన్న ప్రమాదం

కొడంగల్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దుద్యాల్ మండలంలోని హస్నాబాద్‌లో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో దశాబ్దాల కిందట నిర్మించిన వాటర్‌ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పాఠశాల పక్కనే ఇది ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు, ఉపాధ్యాయులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకును కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


హస్నాబాద్‌లో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మోమిన్‌పేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోమిన్‌పేట్ మండల పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు, ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టేకులపల్లికి చెందిన పులిమద్ది యాదయ్య కుమారుడు కృష్ణ(24) కుటుంబ పోషణకు చేసిన అప్పులపై నాలుగు నెలల కిందట తల్లిదండ్రులు, భార్యతో కలిసి శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరుకు వెళ్లి ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన ఉదయం పనికి వెళ్తున్నానని కుటుంబసభ్యులతో చెప్పి బైక్‌పై బయల్దేరివెళ్లాడు. కుటుంబపోషణకు చేసిన అప్పులు, ఆర్థికసమస్యలతో మనస్తాపానికి గురైన కృష్ణ టేకులపల్లి శివారులో ఉన్న అయ్యమ్మ పెద్ద చెరువు కట్టపై బైక్ ఉంచి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి 10నెలల కిందట వివాహమైంది. మృతుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంమర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో బైకు పై వెళ్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరా ప్రకారం రావలకోల్ గ్రామానికి చెందిన నాగరాజు(34) గురువారం ఉదయం మండలంలోని రాజబొల్లారం గ్రామ సమీపంలో తను పని చేసే మోనార్క్ పరిశ్రమకు బైక్ పై బయలు దేరాడు. పూడూరు గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీను ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమితం గాంధీ మార్చురీకి తరలించారు, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు

గజ్వేల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైక్ చోరీ కేసులో నిందితుడికి గజ్వేల్ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. మూడు నెలల కిందట జరిగిన బైక్ చోరీ కేసులో మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం సూర్యనగర్‌కాలనీకి చెందిన శంకర్ సింగ్(25) అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నేరం రుజువైనందున నేరస్తుడికి ఆరు నెలల జైలుశిక్షను విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ సైదా వెల్లడించారు. నిందితుడికి శిక్షపడటంలో కృషి చేసిన అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ శంకర్, ఏఎస్ఐ గోపాల్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ సైదా, కోర్టు కానిస్టేబుల్ కుమార్‌లను సిద్దిపేట పోలీస్‌కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అభినందించడంతో పాటు రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపల్ పటేల్‌నగర్‌కు చెందిన దర్శనం కృష్ణ కూలీపని చేసుకుంటూ భార్య ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటున్నారు. భార్య సునీత(35) స్థానిక గురుకుల్ కాలేజీలో ఉండే తన అన్న కూతురు కోసం వెళ్లి వస్తానని చెప్పి ఈనెల 21 ఉదయం 8.30గంటలకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో భర్త కృష్ణ తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సునీత

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

బషీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ గఫార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన యువకుడు జాదవ్ శ్రీకాంత్, బషీరాబాద్‌కు చెందిన యువతి రాగూరు నాగుబాయికి పాఠశాలలో చదివే రోజుల నుంచి పరిచయం ఉంది. ఈ క్రమంలో యువతి కుటుంబం కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే ఉంది. ఇటీవల యువకుడు శ్రీకాంత్ హైదరాబాద్‌లోనే ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో ఇరువురు హైదరాబాద్‌లో కలుసుకుని ఒకరినొకరు ప్రేమించుకున్నారు. యువతి కుటుంబీకులు వీరి పెళ్లికి అభ్యంతరం చెప్పడంతో ఈనెల 25వ తేదీన ఇంట్లో నుంచి పారిపోయి ఇరువురు పెళ్లి చేసుకున్నారు. యువతి కుటుంబీకుల నుంచి బెదిరింపులు రావడంతో చేసేదేమి లేక పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబాల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని ఎస్ఐ వెల్లడించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?


నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఏవిధంగా ఆడుతుందో ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు అన్నారు. పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వసతులు లేక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. ఒకే సంవత్సరంలో 886మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారన్నారు. మధ్యానికి మంత్రి ఉన్నా విద్యకు లేడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేష్, శివప్రసాద్, తేజ, రామకృష్ణ, ప్రవీణ్, బాలకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

తాండూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురుస్వామి సాయిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సాయిరెడ్డి గురుస్వామి అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వామిని పూలతో ప్రత్యేకంగా అలకంరించారు. 18మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ మహాపడి మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, రాఘవేందర్‌స్వామి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: దుద్యాల మండలంలోని హస్నాబాద్‌లో సురేష్‌గౌడ్‌స్వామి ఇంట్లో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజ నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ ఎం.కృష్ణ, సినీ నటుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి

ఘట్‌కేసర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని కామినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పారా మెడికల్ కోర్సెస్ ప్రొఫెసర్ ఏ.రవిశంకర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలోని బీఫార్మసీ, ఫార్మాడీ, ఎంఫార్మసీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా శ్రవణ్‌కుమార్, సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్, డాక్టర్ రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


డాటా ఎంట్రీని వేగవంతం చేయాలి

మర్పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వే వివరాల నమోదును గురువారం ఆయన పరిశీలించారు. మర్పల్లి మండలంలో ఆన్‌లైన్ నమోదులో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో ఆలస్యం అవుతుందని ఎంపీడీవో ఆయన దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ ఏఈకు ఫోన్ చేసి మాట్లాడారు.

మోమిన్‌పేట్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీని గురువారం ఆయన పరిశీలించారు. ఆయన వెంబడి ఎంపీడీవో విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ ఉమేశ్, మాదవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని 29 గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలను సేకరించారు. ఇప్పటి వరకు 1500పైగా కుటుంబాలను సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. అందుబాటులో లేనివారి ఫోన్ నెంబర్లు సేకరించి సర్వేలో పాల్గొనేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో రాజమల్లయ్య తెలిపారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


పరిగిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం పరిగిలో పార్టీ శ్రేణులు కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.లాల్‌కృష్ణ, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, పి.చంద్రయ్య, హన్మంత్‌ముదిరాజ్, కృష్ణ, చిన్ననర్సింహులు పాల్గొన్నారు.

పూడూరు: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దోమ: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా శివారెడ్డిపల్లి గ్రామంలోని పాఠశాలలో గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్‌లు పంపిణీ చేశారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

బొంరాస్‌పేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలులో క్వింటాలుకు రెండు కిలోల తరుగు తీయడంపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశొరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. క్వింటాలు ధాన్యంలో రెండు కిలోల తరుగు తీయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

దౌల్తాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ గాయత్రి అన్నారు. మండలంలోని బాలంపేట్ కేజీబీవీ పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. స్టోర్‌రూంలో బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మోమిన్‌పేట్: చంద్రాయన్‌పల్లి కేజీబీవీ పాఠశాలను తహసీల్దార్ ప్రభు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సరిత పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్‌రహెమాన్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.


కీసర: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని పాఠశాలలను దుద్యాల తహసీల్దార్ కిషన్‌నాయక్ గురువారం సందర్శించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. హరిజన్‌వాడ ప్రాథమిక, దుద్యాల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు ఉన్నారు.

దోమ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. బొంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంపీడీవో మహేశ్‌బాబు, పీహెచ్‌సీ వైద్యురాలు రజిత, ఎంపీవో సోమలింగం, ఎంఈవో వెంకట్‌తో కలిసి పరిశీలించారు. హెచ్‌ఎం షఫీ, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కీసర: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజనం వాసన వస్తుందని, బియ్యాన్ని శుభ్రంగా కడిగి విద్యార్థులకు వడ్డించాలన్నారు. అదే విధంగా పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

పోరాట యోధుడు పూలే

మేడ్చల్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మేడ్చల్ పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద గల ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, జాకట ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు. అదే విధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పూలే విగ్రహాలకు కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, కండ్లకోయంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న పూలే విగ్రహాలకు పార్టీలకు అతీతంగా స్థానిక నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాండూరు: బీసీసంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం తాండూరులో ఆయన చిత్రపటానికి బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, బస్వరాజ్, సిద్దిలింగం పాల్గొన్నారు.

యాలాల: మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకుని యాలాల మండల కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మధుసూదన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, కొంగి రవికుమార్, సత్యనారాయణరెడ్డి, కె.నర్సింహులు, జోగు రమేష్, గజ్జెల బాలయ్య, ప్రవీణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


తాండూరు: మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

కీసర రూరల్: నాగారంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ముత్యం వెంకన్నగూడ, కీసర డీఈ లింగయ్య, మల్లేష్, రాంప్రదీప్, లక్ష్మి, దయానంద్, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం!

(5వ పేజీ తరువాయి)

దశాబ్ద కాలంగా విద్యార్థులు పోరాటాలు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. సమీపంలో డిగ్రీ కాలేజీ లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ఇక్కడ నుంచి గెలిచి మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించిన ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి తన సొంత డబ్బులతో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తానని ఆరేళ్ల క్రితం ఇచ్చిన హామీ కూడా అలాగే మిగిలిపోయింది.

మారని శామీర్‌పేట బస్టాండ్ దుస్థితి

ఒకప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హయంలో నిర్మించిన శామీర్‌పేట బస్టాండ్‌ను నేడు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో అది పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. 8 ఎకరాల విశాలమైన స్థలం, ఆహ్లాదకరమైన వాతావరణంలో రాజీవ్‌రహదారికి ఆనుకుని శామీర్‌పేట నడిబొడ్డున ఉన్న బస్టాండ్ నేడు కళావిహీనంగా మారింది. ఇందుకు ప్రధాన కారణం బస్టాండ్ ఆవరణలోకి బస్సులు రాకపోవడమే. ఒకప్పుడు క్రమం తప్పకుండా బస్సులు వచ్చేవి. దీంతో బస్టాండ్ ప్రయాణికులతో కళకళలాడేది.

ప్రారంభానికి నోచుకోని రైతుబజార్

2011లో రూ.98 లక్షలు వెచ్చించి నిర్మించిన మేడ్చల్ రైతుబజార్ 13 సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. నిర్మాణం పూర్తయినా స్థల వివాదం కారణంగా అలాగే మిగిలిపోయింది. దీంతో రోడ్లపైనే కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నారు. స్థల వివాదానికి పరిష్కారం చూపకపోవడంతో ఏళ్ల తరబడి సమస్య అలాగే ఉంది.

శాపంగా డంపింగ్ యార్డు

నియోజకవర్గ ప్రజలకు జవహర్ నగర్ డంపింగ్ యార్డు శాపంగా మారింది. కీసర మండలానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వేసే చెత్తాచెదారంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయి. చర్మ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. పంటలు సైతం నాశనం అవుతున్నాయని ప్రజలు విన్నవించినా పాలకులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

పర్యాటక కేంద్రంగా మారని కీసరగుట్ట

కీసర రామలింగేశ్వర స్వామి ఆలయం పర్యాటక కేంద్రంగా మారుతుందా లేదా అని ప్రజలు అత్యతగా ఎదురుచూస్తున్నారు. ఇక్కడ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గతంలో బీఆర్ఎస్ హయంలో రూ. 75 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికను సిద్ధం చేశారు. అనాటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ప్రఖ్యాత శిల్పి ఆనంద్‌సాయిలు ఇద్దరు ఆలయాన్ని సందర్శించినప్పటికీ ఇప్పటికీ పనులు ముందడుగు వేయలేదు. ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కీసరగుట్టను సందర్శించి పర్యాటక కేంద్రం ఏర్పాటుపై డీపీఆర్ సిద్ధం చేశామని ఆదేశించినప్పటికీ అది కార్యరూపం దాల్చేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

శిథిలావస్థలో ఘట్‌కేసర్ గురుకులం

ఘట్‌కేసర్‌లోని గురుకుల్ పాఠశాల శిథిలమై అస్తవ్యస్తంగా మారింది. ఒకప్పుడు వందల మంది విద్యార్థులతో విరాజిల్లిన విద్యాలయం నేడు కనీస కాపలదారు సైతం లేక వెలవెలబోయి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు ముందుకురావడం లేదు. విద్యాలయం మూతపడే ప్రమాదం ఏర్పడినప్పటికీ పాలకులు కనీసం పట్టించుకోవడం లేదు. ప్రపంచంలోనే ఏ యూనివర్సిటీకీ లేనన్ని ఆస్తులు ఘట్‌కేసర్ గురుకుల్ పేరిట ఉండగం గమనార్హం. అలాగే ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోవడంతో పజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంక్షిప్తంగా..

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొడంగల్/పూడూరు: చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌సీ కొత్తగడి పాఠశాలలో కొడంగల్‌లోని కృష్ణవేణి టాలంట్ పాఠశాలకు చెందిన అబ్దుల్ బాసిత్, అరుణ్‌కుమార్, సుమయ్య ఫాతిమా పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మక్సూద్‌అలీ తెలిపారు. అదేవిధంగా పూడూరు మండలం కంకల్ విద్యార్థులుఎం.ప్రకాష్, యు.శ్రీనిది, జి.వైష్ణవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి అందుకున్నారు. హెచ్‌ఎం.పుష్ప వారిని అభినందించారు.

రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ

బొంరాస్‌పేట్: మెట్లకుంటలో రూ.4కోట్ల 80లక్షలతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశొరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ గురువారం భూమిపూజ చేశారు.

30న ఉచిత మెగా వైద్య శిబిరం

వికారాబాద్: లయన్స్ క్లబ్, వికారాబాద్ క్లబ్ సంయుక్తంగా మహావీర్ ఆస్పత్రి వైద్య బృందంతో ఈనెల 30నఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు లవకుమార్ గురువారం తెలిపారు.

మానవత్వం చాటుకున్న యువకుడు

వికారాబాద్: పట్టణానికి చెందిన రాందాస్ సోని బుధవారం రాత్రి పట్టణంలో రోడ్లపై పండుకున్న వారికి 80కి పైగా దుప్పట్లను పంపిణీ చేశాడు.

తహసీల్దార్‌ను కలిసిన నూతన ఏఎంసీ చైర్మన్

మూడుచింతలపల్లి: మండలంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకట్‌నర్సింహారెడ్డిని గురువారం నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన మేడ్చల్ ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నర్సింహులుయాదవ్‌ను ఆయన సత్కరించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

శామీర్‌పేట: తుర్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ దాసరి రవి ముదిరాజ్ గురువారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అదేవిధంగా పల్లపు కుమార్ సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేసేందుకు రూ.10వేలు విరాళంగా అందజేశారు.

కేజీబీవీ విద్యార్థులకు ఎంపీడీవో క్లాస్

బషీరాబాద్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంపీడీవో విజయ్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిగా మారి అక్కడి విద్యార్థులకు క్లాస్ తీసుకున్నారు.

24వ వార్డులో రుద్రాభిషేకం

వికారాబాద్: శివాజీనగర్ కాలనీ మైసమ్మగుడి ఆవరణలో గురువారం ఆధ్యాత్మిక సేవ మండలి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవి సదానందారెడ్డి, ప్రభు నగర్ ఆస్థాన పీఠాధిపతి ఛయన సోమయాజీ, శ్రీశ్రీ బాల మారతాండ మాణిక్ ప్రభు మహారాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బండవెల్కిచర్లలో సినీ నటుల సందడి

కులకచర్ల: బండవెల్కిచర్ల శివారులో సినీ, జబర్దస్త్ నటుడు రాజమౌళి సినీ ఆర్టిస్టు మల్లికార్జున్‌తో కలిసి కోతకు వచ్చిన వరిపైరును పరిశీలించారు. వ్యవసాయ పరిశోధనల్లో నూజివీడు సీడ్స్ సంస్థ వరి విత్తనం ఎన్‌పీ-9159 పుష్కల్‌పై స్కిట్‌ల రూపంలో రాజమౌళి ప్రదర్శించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ

నవాబుపేట: మండలంలోని చిట్టిగిద్దలో గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రవికుమార్, మండల ఇన్‌చార్జి కిష్టయ్య ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సందీప్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తరుణ్‌కుమార్, అధికార ప్రతినిధిగా దయాకర్, ప్రధాన కార్యదర్శిగా సందీప్‌కుమార్, కార్యదర్శిగా ప్రశాంత్‌కుమార్, నవీన్, కోశాధికారిగా నర్సింహులు, ప్రచార కార్యదర్శిగా అజయ్‌కుమార్, కిషోర్, సలహాదారులుగా దయానంద్, రాజు, శేఖర్, నర్సింహులును ఎన్నుకున్నారు.

ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

కులకచర్ల: మండలంలోని సాల్విడ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఓటు హక్కు వినియోగంపై ఎంఈవో హబీబ్‌అహ్మద్‌మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఫోక్ డ్యాన్స్‌లో నస్కల్ విద్యార్థుల ప్రతిభ

పరిగి: నేషనల్ కల్చరల్ ఫెస్టివల్-2024లో భాగంగా రవీంద్రభారతిలో జరిగిన క్లాసికల్, ఫోక్ డ్యాన్స్ పోటీల్లో నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ విద్యార్థినులు పాల్గొని ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరిని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యాదయ్యలు అభినందించి బహుమతులను ప్రదానం చేశారు.

డిగ్రీ కళాశాలకు ఫర్నీచర్ వితరణ

పరిగి: ఓయూ జేఏసీ నాయకులు, డీసీసీ కార్యదర్శి, పీహెచ్‌డీ స్కాలర్ కొమిరె రాంచంద్రయ్య ఉదారతను చాటారు. పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఓయూ ప్రొఫెసర్ నర్సింహారెడ్డి సూచనతో రూ.లక్ష విలువ చేసే టేబుళ్లు, కుర్చీలు అందజేశారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ అందజేత

దోమ: గుండాల గ్రామానికి చెందిన బోయిని రమేశ్‌కు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మహేంద్ర ట్రాక్టర్‌ను చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ సీఎస్ఈ డీన్ డాక్టర్ విష్ణుమూర్తి తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఇన్నోవేస్ట్ హ్యాకథాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీన్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నియామకం

తాండూరు: నియోజకవర్గంలోని అతిపెద్ద దేవస్థానమైన భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ కమిటీని గురువారం నియమించారు. కమిటీ సభ్యులుగా పటేల్ కిరణ్ కుమార్, జాక సంగమేశ్వర్, జొల్లు రోహిణి, శెట్టి సురేష్, గాండ్ల వీరన్న, కల్లూరి బస్వరాజ్, సిద్ది లింగం, ఎం.ప్రశాంత్ కుమార్, గాడిగి కిరణ్‌కుమార్‌లను నియమించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

కులకచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండలంలోని కామునిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, తయారు చేసిన భోజనం, నిత్యావసర వస్తువులను ఆయన పరిశీలించారు.

మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములవ్వాలి


సదస్సులో మాట్లాడుతున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నివారణలో ప్రతీఒక్కరు భాగస్వాములవ్వాలని పరిగి డీఎస్పీ ఎస్.శ్రీనివాస్ అన్నారు. సుదీక్ష(ఇంగస్వ్యాలీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్)లో గురువారం మాదకద్రవ్యాల నివారణపై పాఠశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు విద్యార్థులు, యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తాయని, వాటి దుష్ఫలితాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొన్ని విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు చాక్లెట్లు విక్రయాలు జరుగుతున్నాయని, ఇలాంటి పట్లఅప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలకు ఎలాంటి ఇబ్బదులు ఎదురైనా వెంటనే 100 డయల్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ దయాసాగర్ ఎంఈవో ఎం.గోపాల్, పాఠశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, డైరెక్టర్ వీరేశం, రిటైర్డ్ హెచ్‌ఎం పి.వెంకట్‌రాంరెడ్డి, పీఈటీ రాజేందర్ పాల్గొన్నారు.

పరిగి డీఎస్పీని కలిసిన ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్: పరిగి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను కొడంగల్ పట్టణానికి చెందిన డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప, అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత రామన్న, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దస్తయ్య, కృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పరిగి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీని కలిసి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు.

రైతు సదస్సుకు తరలిన అన్నదాతలు

తాండూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా పాలమూరులో ప్రారంభమైన రైతు పండుగ ఎగ్జిబిషన్‌కు తాండూరు వ్యవసాయ డివిజన్ నుంచి అన్నదాతలు తరలివెళ్లారు. తాండూరు వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండలం అమిస్తాపూర్‌లో జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు గురువారం రైతులను తీసుకెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, మందులు, విత్తనాలను పరిశీలించారు.

కులకచర్ల: మహబూబ్‌నగర్‌లో రైతు సదస్సుకు ప్రత్యేక బస్సుల్లో కులకచర్ల, ముజాహిద్‌పూర్, చౌడాపూర్, మరికల్ గ్రామాలకు చెందిన రైతులు బయలుదేరి వెళ్లారు. మూడు రోజుల పాటు జరిగే రైతు సదస్సుకు గురువారం మండలం నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఈ సదస్సుల్లో పాల్గొననున్నారు. రైతులను ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లి, తీసుకువస్తామని ఏవో వీరస్వామి తెలిపారు.